


జాతీయ తెలుగు దినపత్రిక

RNI - TGTEL/25/A0348

# సందేశం టైమ్స్

నిజం దాగదు – వార్త ఆగదు




శనివారం 14 మార్చి 2026 | పేజీలు 04 | వెల - 2/- | సంపుటి 01 సంచిక 285 | ప్రచురణ - తెలంగాణ & ఆంధ్రప్రదేశ్ | ఎడిటర్ : కాసే అమృత



## రాష్ట్రంలో ఎల్పీజీ గ్యాస్ సరఫరాపై సీఎస్ సమీక్ష

సందేశం టైమ్స్, హైదరాబాద్, 14 మార్చి: రాష్ట్రంలో ఎల్పీజీ గ్యాస్ నిల్వలు, వినియోగదారులకు సరఫరా, ప్రస్తుత పరిస్థితులపై రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణారావు శుక్రవారం డా.బి.ఆర్. అంబేద్కర్ రాష్ట్ర సచివాలయంలో ఆయిల్ మార్కెటింగ్ కంపెనీల ప్రతినిధులు, పౌర సరఫరాల శాఖ అధికారులతో సమీక్ష నిర్వహించారు. రాష్ట్రవ్యాప్తంగా ఎల్పీజీ గ్యాస్ సరఫరా, నిల్వలు, రవాణా వ్యవస్థ, భవిష్యత్ అవసరాలపై సమగ్రంగా చర్చించారు. ఈ సందర్భంగా గృహ వినియోగదారులకు ఎల్పీజీ సిలిండర్ల పంపిణీలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా తగు చర్యలు తీసుకోవాలని సీఎస్ ఆదేశించారు. రోజువారీ సమీక్ష నిర్వహిస్తూ బ్లాక్ మార్కెటింగ్ జరగకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని, డిస్ట్రిబ్యూటరీలు మరియు ఏజెన్సీల వద్ద పోలీసు నిఘా ఉండేలా చూడాలని సూచించారు. ప్రస్తుతం రాష్ట్రంలో 1.29 కోట్ల గృహ వినియోగదారుల కనెక్షన్లు ఉన్నాయని, ప్రస్తుత డిమాండ్‌కు సరిపడా నిల్వలు ఉన్నాయని అధికారులు తెలిపారు. ఆసుపత్రులు, ప్రభుత్వ హాస్టళ్లకు డిమాండ్ మేరకు ఎల్పీజీ సిలిండర్ల సరఫరా కొనసాగుతోందని వెల్లడించారు. గృహ వినియోగదారులు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ఆయిల్ కంపెనీల ప్రతినిధులు, శాఖ అధికారులు పేర్కొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 810 డిస్ట్రిబ్యూటరీ కేంద్రాల ద్వారా ఎల్పీజీ సిలిండర్లు సరఫరా చేస్తున్నట్లు తెలిపారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో సకాలంలో సరఫరా జరిగేలా ఆయిల్ మార్కెటింగ్ కంపెనీలు సంబంధిత శాఖలతో సమన్వయం పెంచాలని సీఎస్ సూచించారు. సమావేశంలో హెచ్‌పీసీఎల్, ఐఓసీఎల్, బీపీసీఎల్ ప్రతినిధులు, రాష్ట్ర పౌర సరఫరాల శాఖ కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర తదితర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.



## గ్యాస్ కొరతపై అపోహలు నమ్మవద్దు మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి

సందేశం టైమ్స్, హైదరాబాద్, 14 మార్చి: రాష్ట్రంలో ఎల్పీజీ గ్యాస్ కొరత ఏర్పడిందన్న ప్రచారంలో ఎలాంటి వాస్తవం లేదని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. అమెరికా–ఇరాన్ యుద్ధం నేపథ్యంలో రాష్ట్రంలో గ్యాస్ కొరత ఉందని సోషల్ మీడియాలో జరుగుతున్న ప్రచారం ప్రజల్లో గందరగోళం సృష్టిస్తోందని పేర్కొన్నారు. శుక్రవారం డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ సచివాలయంలో సహచర మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణారావు, పౌర సరఫరాల శాఖ కమిషనర్ స్టీఫెన్ రవీంద్రలతో కలిసి జిల్లాల కలెక్టర్లు, ఎస్పీలు, పోలీస్ కమిషనర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. రాష్ట్రంలో 810 ఎల్పీజీ డిస్ట్రిబ్యూటర్ల ద్వారా గ్యాస్ సరఫరా జరుగుతుందని, మొత్తం 1.29 కోట్ల కనెక్షన్లు ఉండగా రోజుకు సుమారు 2.5 లక్షల సిలిండర్ల సరఫరా జరుగుతోందని తెలిపారు. బాట్లింగ్ ప్లాంట్లలో ఎక్కడా గ్యాస్ కొరత నమోదు కాలేదని, అపోహలను ఆసరాగా చేసుకుని బ్లాక్ మార్కెటింగ్, అక్రమ నిల్వలు లేదా మళ్లింపులు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఇప్పటివరకు అలాంటి చర్యలకు పాల్పడిన వారిపై 288 కేసులు నమోదు చేసినట్లు వెల్లడించారు. గృహ వినియోగదారులతో పాటు ఆసుపత్రులు, విద్యాసంస్థలు, వృద్ధాశ్రమాలు, ప్రభుత్వ సంస్థలకు ప్రాధాన్యత క్రమంలో గ్యాస్ సరఫరా చేస్తామని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా కమాండ్ కంట్రోల్ సెంటర్ ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించిందని, జిల్లాల వారీగా కలెక్టర్ ఆధ్వర్యంలో కమిటీలు ఏర్పాటు చేసి రోజువారీ నిల్వలు, సరఫరా పరిస్థితిని సమీక్షించాలని ఆదేశించారు. పట్టణ ప్రాంతాల్లో 25 రోజులకు ఒకసారి, గ్రామీణ ప్రాంతాల్లో 45 రోజులకు ఒకసారి గ్యాస్ బుకింగ్ చేసుకోవాలని వినియోగదారులకు సూచిస్తూ అపోహలు నమ్మి అవసరానికి మించి సిలిండర్లు బుక్ చేసుకోవద్దని మంత్రి ప్రజలకు విజ్ఞప్తి చేశారు.



## ఆవిష్కరణలు, పెట్టుబడులకు గ్లోబల్ హబ్‌గా హైదరాబాద్: మంత్రి శ్రీధర్ బాబు

సందేశం టైమ్స్, హైదరాబాద్, 14 మార్చి: ప్రపంచ స్థాయి మౌలిక సదుపాయాలతో హైదరాబాద్‌ను ఆవిష్కరణల కేంద్రంగా తీర్చిదిద్దామని రాష్ట్ర ఐటి, పరిశ్రమలు మరియు వాణిజ్య శాఖల మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు తెలిపారు. ఐటి, ఎలక్ట్రానిక్స్ రంగాలతో పాటు ఫార్మా, డిఫెన్స్, ఏవియేషన్ పరిశ్రమలకు కూడా నగరం కీలక వేదికగా మారిందని పేర్కొన్నారు. బ్రిక్స్ దేశాల్లో పారిశ్రామికాభివృద్ధి, పెట్టుబడుల అవకాశాలపై అధ్యయనం చేయడానికి వచ్చిన జర్మన్ ప్రతినిధి బృందం సచివాలయంలో మంత్రి శ్రీధర్ బాబును కలిసింది. 'గ్లోబల్ బ్రిడ్జెస్' అంతర్జాతీయ స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులతో కలిసి వచ్చిన ఈ బృందంతో తెలంగాణలో ఉన్న పారిశ్రామిక అవకాశాలు, అంతర్జాతీయ పెట్టుబడిదారులకు ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహకాలపై మంత్రి చర్చించారు. పరిశ్రమలకు నిరంతర విద్యుత్ సరఫరా, నీటి లభ్యతకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుందని, స్థిరమైన పారిశ్రామిక విధానాలతో పరిశ్రమలకు అనుకూల వాతావరణం కల్పిస్తున్నామని చెప్పారు. హైదరాబాద్ నగరం ఆహ్లాదకర వాతావరణం, విభిన్న సంస్కృతుల సమ్మేళనంతో ప్రపంచం నలుమూలల నుంచి వచ్చే వారికి అనుకూల నగరంగా నిలుస్తోందని తెలిపారు. నగరం దక్షిణ భాగంలో 'ఫ్యూచర్ సిటీ' ప్రాజెక్టు వేగంగా రూపుదిద్దుకుంటోందని, ఇందులో భాగంగా ఏఐ సిటీ, నెట్ జీరో సిటీ, యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ వంటి ప్రాజెక్టులు రాష్ట్ర భవిష్యత్తుకు బలమైన పునాది వేస్తాయని పేర్కొన్నారు. తెలంగాణలో ఉన్న మానవ వనరులు, ప్రతిభావంతులైన యువతతో పరిశ్రమలకు నిపుణుల కొరత ఉండదని స్పష్టం చేశారు. సెమీ కండక్టర్ రంగం రాష్ట్రంలో వేగంగా అభివృద్ధి చెందుతుందని, చిప్స్ డిజైన్, తయారీ రంగాల్లో తైవాన్, కొరియా సంస్థలు కార్యకలాపాలు ప్రారంభించాయని తెలిపారు. డేటా సెంటర్ల ఏర్పాటుకు కూడా దిగ్గజ కంపెనీలు ముందుకొస్తున్నాయని పేర్కొన్నారు. 2047 నాటికి తెలంగాణను 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో ప్రభుత్వం కృషి చేస్తోందని మంత్రి వెల్లడించారు. సమావేశంలో జర్మన్ ప్రతినిధి బృందం సభ్యులు డా. స్టెఫాన్ ట్రేగర్, డా. క్రిస్టియన్ అల్టెన్ హోఫెన్, ఫ్రాంక్ బీర్ హోస్ట్, అలెగ్జాండర్ వాన్ క్రామ్, మాల్టె హోహ ఫీల్డ్, ఫిలిప్ మేయర్ హోఫర్, మ్యాక్స్ మిల్లన్ వ్యాన్ లెయర్ తదితరులు పాల్గొన్నారు. రాష్ట్ర పరిశ్రమల శాఖ డైరెక్టర్ నిఖిల్ చక్రవర్తి కూడా హాజరయ్యారు.

## అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల నేపథ్యంలో అధికారులకు సీఎస్ ఆదేశాలు



సందేశం టైమ్స్, హైదరాబాద్, 14 మార్చి: ఈనెల 16వ తేదీ నుంచి అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు ప్రారంభమవుతున్న నేపథ్యంలో ఇప్పటివరకు వచ్చిన ప్రశ్నలకు సంబంధించిన సమాధానాలను వెంటనే సమర్పించాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణారావు అన్ని శాఖల ఉన్నతాధికారులను ఆదేశించారు. అసెంబ్లీ సమావేశాల ప్రారంభం నేపథ్యంలో పెండింగ్‌లో ఉన్న ప్రశ్నలకు సమాధానాలు, సమావేశాల నిర్వహణ ఏర్పాట్లపై రాష్ట్ర ప్రభుత్వ కార్యదర్శులతో టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించి సమీక్షించారు. ఈ సందర్భంగా శాసనసభ, శాసన మండలి సభ్యులు అడిగిన ప్రశ్నలన్నింటికీ రేపటిలోగా సమాధానాలు పంపాలని సూచించారు. ముఖ్యంగా నీటిపారుదల, వైద్య ఆరోగ్య, మున్సిపల్ పరిపాలన, ఇంధన, రెవిన్యూ శాఖలకు సంబంధించి అధికంగా ప్రశ్నలు ఉన్నాయని, వాటన్నింటికీ వెంటనే సమాధానాలు సమర్పించాలని తెలిపారు. బడ్జెట్ సమావేశాలు గవర్నర్ ప్రసంగంతో ప్రారంభమవుతాయని వెల్లడించారు. సమావేశాల నిర్వహణపై రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి ఆదివారం ప్రత్యేక సమావేశం నిర్వహించనున్నట్లు చెప్పారు. ఈ సమీక్షలో ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శులు, ముఖ్యకార్యదర్శులు, కార్యదర్శులు మరియు ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణను వేగవంతం చేయాలి: రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి






సందేశం టైమ్స్ సంగారెడ్డి, మార్చి 14( టీ సంగమేశ్వర్ )సంగారెడ్డి జిల్లా ఓటర్ల జాబితా సవరణలో భాగంగా చేపట్టిన స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేయాలని రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి అధికారులకు సూచించారు. శుక్రవారం హైదరాబాద్ నుంచి రాష్ట్ర ఎన్నికల అధికారులతో కలిసి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని జిల్లాల కలెక్టర్లు, ఎన్నికల అధికారులతో ఎస్ఐఆర్ పురోగతిపై సమీక్ష నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణలో ఎలాంటి పొరపాట్లు చోటు చేసుకోకుండా మ్యాపింగ్ ప్రక్రియను సమగ్రంగా నిర్వహించాలని అన్నారు. సూపర్వైజర్లు, ఏఈఆర్ఓలు క్షేత్రస్థాయిలో నిరంతరం పర్యటిస్తూ ప్రక్రియను పర్యవేక్షించాలని సూచించారు. ఒకే వ్యక్తి పేరుతో రెండు చోట్ల ఓటు నమోదు కాకుండా జాబితాను జాగ్రత్తగా పరిశీలించాలని తెలిపారు.రాజకీయ పార్టీల ద్వారా బూత్ లెవల్ ఏజెంట్లను నియమించడంతో పాటు బీఎల్ఓలకు ఐడీ కార్డులు తప్పనిసరిగా ఉండాలని పేర్కొన్నారు. మరణించిన ఓటర్ల వివరాలు, పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులు, డెమోగ్రాఫిక్ సిమిలర్ ఎంట్రీస్ అంశాలపై ప్రత్యేక దృష్టి సారించి సవరణ ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు.సంగారెడ్డి కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి సమావేశంలో పాల్గొన్న జిల్లా కలెక్టర్ పి. ప్రావీణ్య మాట్లాడుతూ జిల్లాలో ఎస్ఐఆర్ ప్రక్రియను ఎలాంటి లోపాలు లేకుండా సమర్థవంతంగా పూర్తి చేస్తామని తెలిపారు. అనంతరం జిల్లా అధికారులతో మాట్లాడుతూ సవరణ ప్రక్రియలో మంచి పురోగతి సాధిస్తున్నామని, ఇదే ఉత్సాహంతో నిర్దేశించిన లక్ష్యాలను సాధించాలని అధికారులకు సూచించారు.డీఎస్ఈ పెండింగ్ అంశాలను త్వరగా పరిష్కరించాలని తహసీల్దార్లను ఆదేశించారు. జిల్లాలో మ్యాపింగ్ ప్రక్రియను వేగవంతం చేసేందుకు సూపర్వైజర్లు, బీఎల్ఓలు సమన్వయంతో పనిచేయాలని, మండల స్థాయి అధికారులు నిరంతరం పర్యవేక్షణ చేపట్టాలని అన్నారు.ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ పాండు, ఆర్డీఓ రాజేందర్, ఈఆర్ఓ పటాన్ చెరువు అంబదాస్ రాజేశ్వర్, హెచ్ సెక్షన్ సూపరింటెండెంట్ విజయలక్ష్మి, ఎన్నికల విభాగం అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## నిరుద్యోగుల నిరసనలో ఆప్ నాయకుల అరెస్ట్‌పై హేమ సుదర్శన్ జిల్లోజు విమర్శలు





సందేశం టైమ్స్, హైదరాబాద్, 14 మార్చి: హైదరాబాద్‌లోని దిల్‌సుఖ్‌నగర్‌లో నిరుద్యోగులు నిర్వహించిన ధర్నాలో పాల్గొన్న ఆమ్ ఆద్మీ పార్టీ నాయకులను పోలీసులు అరెస్ట్ చేయడాన్ని ఆప్ తెలంగాణ రాష్ట్ర కన్వీనర్ హేమ సుదర్శన్ జిల్లోజు తీవ్రంగా ఖండించారు. నిరుద్యోగుల తరఫున శాంతియుతంగా నిరసన తెలుపుతున్న ఆప్ నాయకులు, అభ్యర్థులను పోలీసులు అదుపులోకి తీసుకుని మలక్‌పేట్ పోలీస్ స్టేషన్‌కు తరలించడం ప్రజాస్వామ్యానికి విరుద్ధమని ఆమె ఆరోపించారు. మలక్‌పేట్ పోలీస్ స్టేషన్ వద్ద మీడియాతో మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నిరుద్యోగుల ఆవేదనను పట్టించుకోవడం లేదని విమర్శించారు. అధికారంలోకి రాకముందు నిరుద్యోగుల పక్షాన నిలుస్తామని హామీ ఇచ్చిన ప్రభుత్వం ఇప్పుడు నిరుద్యోగులు తమ హక్కుల కోసం రోడ్డెక్కితే అరెస్టులు చేయించడం దురదృష్టకరమని అన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన మెగా డీఎస్సీ, జాబ్ క్యాలెండర్ మరియు ఉద్యోగాల భర్తీ హామీలు అమలు కాలేదని విమర్శించారు. ప్రజా సమస్యలను వినిపించేందుకు వెళ్లిన వారిని లాఠీలతో, అరెస్టులతో అడ్డుకోవడం నిరంకుశ పాలనకు నిదర్శనమని పేర్కొన్నారు. అరెస్టు చేసిన వారిని వెంటనే విడుదల చేయాలని, నిరుద్యోగుల డిమాండ్లను ప్రభుత్వం బేషరతుగా ఆమోదించాలని డిమాండ్ చేశారు. తెలంగాణ నిరుద్యోగుల హక్కుల కోసం ఆమ్ ఆద్మీ పార్టీ పోరాటం కొనసాగిస్తుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఉప్పల్ ఎక్స్ ఇంచార్జ్ సుధారాణి, రమ్య గౌడ్ తదితరులు పాల్గొన్నారు.




# జిల్లాలో ఎల్పీజీ గ్యాస్ కొరత లేదు: కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్

సందేశం టైమ్స్, సూర్యాపేట, 14 మార్చి: జిల్లాలో గృహ అవసరాలకు వినియోగించే ఎల్పీజీ గ్యాస్ సిలిండర్లకు ఎలాంటి కొరత లేదని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ స్పష్టం చేశారు. శుక్రవారం అదనపు కలెక్టర్ చాంబర్లో జిల్లాలోని గ్యాస్ ఏజెన్సీలు, పౌర సరఫరాల అధికారులతో ఎల్పీజీ గ్యాస్ సరఫరాపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సూర్యాపేట జిల్లాలో 4 లక్షల 15 వేల 509 గృహ వినియోగదారుల కనెక్షన్లు ఉన్నాయని, ప్రస్తుతం జిల్లాలో 17 వేల 647 డొమెస్టిక్ సిలిండర్లు, 552 కమర్షియల్ సిలిండర్లు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. గ్యాస్ బుక్ చేసుకున్న వినియోగదారులకు రెండు మూడు రోజుల్లోనే సకాలంలో డెలివరీ అందిస్తున్నామని వివరించారు. కమర్షియల్ సరఫరాలో ఏర్పడిన కొరతను అధిగమించేందుకు చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. గృహ అవసరాలకు వినియోగించే గ్యాస్‌ను ఎవరైనా కమర్షియల్ అవసరాలకు వినియోగిస్తే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గ్యాస్ సరఫరాలో ఎలాంటి కొరతలేనందున ప్రజలు ఆందోళన చెందకుండా అనవసరంగా గ్యాస్ బుక్ చేసుకోవద్దని కోరారు. గ్యాస్ బుకింగ్‌కు సంబంధించి సర్వర్ సమస్యలు ఉన్నట్లు తమ దృష్టికి వచ్చిందని, దీనిపై గ్యాస్ ఏజెన్సీలతో మాట్లాడి త్వరలోనే సమస్యను పరిష్కరిస్తామని తెలిపారు. ఏజెన్సీ నిర్వాహకులు అక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ హెచ్చరించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ కె. సీతారామారావు, జిల్లా పౌర సరఫరా అధికారి మోహన్ బాబు, జిల్లా మేనేజర్ సివిల్ సప్లై రాము తదితరులు పాల్గొన్నారు.

# గ్యాస్ కొరతపై అపోహలు నమ్మవద్దు: మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి

## రాష్ట్రంలో 810 డిస్ట్రిబ్యూటర్ల ద్వారా గ్యాస్ సరఫరా రోజుకు సుమారు 2.5 లక్షల సిలిండర్ల సరఫరా





సందేశం టైమ్స్, సూర్యాపేట, 14 మార్చి: రాష్ట్రంలో ఎల్పీజీ గ్యాస్ కొరత ఏర్పడిందన్న ప్రచారంలో ఎలాంటి వాస్తవం లేదని రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. అమెరికా-ఇరాన్ యుద్ధం నేపథ్యంలో గ్యాస్ కొరత ఉందని సోషల్ మీడియాలో జరుగుతున్న ప్రచారం ప్రజల్లో గందరగోళం సృష్టిస్తోందని పేర్కొన్నారు. శుక్రవారం డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ సచివాలయం నుండి జిల్లాల కలెక్టర్లు, ఎస్పీలు, పోలీస్ కమిషనర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్రంలో 810 ఎల్పీజీ డిస్ట్రిబ్యూటర్ల ద్వారా గ్యాస్ సరఫరా జరుగుతుందని, మొత్తం 1.29 కోట్ల కనెక్షన్లు ఉండగా రోజుకు సుమారు 2.5 లక్షల సిలిండర్ల సరఫరా జరుగుతోందని తెలిపారు. బాట్లింగ్ ప్లాంట్లలో ఎక్కడా గ్యాస్ కొరత నమోదు కాలేదని, అపోహలను ఆసరాగా చేసుకుని బ్లాక్ మార్కెటింగ్, అక్రమ నిల్వలు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఇప్పటివరకు అలాంటి చర్యలకు పాల్పడిన వారిపై 288 కేసులు నమోదు చేసినట్లు వెల్లడించారు. గృహ వినియోగదారులతో పాటు ఆసుపత్రులు, విద్యాసంస్థలు, వృద్ధాశ్రమాలు, ప్రభుత్వ సంస్థలకు ప్రాధాన్యత క్రమంలో గ్యాస్ సరఫరా చేస్తామని చెప్పారు. రాష్ట్రవ్యాప్తంగా కమాండ్ కంట్రోల్ సెంటర్ ఏర్పాటు చేయాలని నిర్ణయించినట్లు తెలిపారు. జిల్లాల వారీగా కలెక్టర్ ఆధ్వర్యంలో కమిటీలు ఏర్పాటు చేసి రోజువారీ నిల్వలు, సరఫరా పరిస్థితిని సమీక్షించాలని ఆదేశించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, పౌర సరఫరాల శాఖ కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర తదితరులు పాల్గొన్నారు.
సూర్యాపేట జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ మాట్లాడుతూ జిల్లాలో గ్యాస్ సరఫరాపై మానిటరింగ్ కమిటీ ద్వారా పర్యవేక్షణ చేస్తున్నామని, వినియోగదారులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. కమర్షియల్ కొరత నేపథ్యంలో డొమెస్టిక్ సిలిండర్లు పక్కదారి పడకుండా గ్యాస్ ఏజెన్సీలకు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చినట్లు చెప్పారు. అదేవిధంగా జిల్లాలో సాగునీటి అవసరాల కోసం సాగర్, మూసీ, ఎస్సారెస్పీ స్టేజ్-2 నుంచి నీటి విడుదల జరుగుతోందని తెలిపారు. మార్చి 15 నుంచి నాగార్జునసాగర్ నుంచి సాగునీరు విడుదల చేయనున్నట్లు పేర్కొన్నారు. వరి ధాన్యం కొనుగోలు కోసం జిల్లాలో ఎక్కువ సంఖ్యలో కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి, గన్ని బ్యాగులు మరియు గోదాములు సిద్ధం చేసినట్లు కలెక్టర్ వెల్లడించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్ కే. సీతారామారావు, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి శ్రీధర్ రెడ్డి, మార్కెటింగ్ శాఖ అధికారి నాగేశ్వర శర్మ, జిల్లా పౌర సరఫరాల అధికారి మోహన్ బాబు, డీఎం సివిల్ సప్లై రాము తదితర అధికారులు పాల్గొన్నారు.

# మ్యాపింగ్ ప్రక్రియ పకడ్బందీగా చేపట్టాలి: రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి

సందేశం టైమ్స్, సూర్యాపేట, 14 మార్చి: ప్రత్యేక సమగ్ర సవరణ దృష్ట్యా మ్యాపింగ్ ప్రక్రియను పకడ్బందీగా చేపట్టాలని రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి అధికారులకు సూచించారు. శుక్రవారం హైదరాబాద్ నుండి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని జిల్లాల ఎన్నికల అధికారులు, కలెక్టర్లు, ఈఆర్‌ఓలు, ఏఈఆర్‌ఓలతో ప్రత్యేక సమగ్ర సవరణకు సంబంధించిన మ్యాపింగ్ ప్రక్రియపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బూత్ స్థాయి అధికారులకు అవసరమైన సహాయ సహకారాలు అందిస్తూ మ్యాపింగ్ ప్రక్రియ పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. బూత్ స్థాయి అధికారులు ఇంటింటికి వెళ్లి మ్యాపింగ్ ప్రక్రియను పూర్తి చేయాలని, గ్రామ పాలన అధికారులు తదితరులను బూత్ స్థాయి అధికారులకు సహాయకులుగా నియమించి ప్రక్రియ వేగవంతం చేయాలని తెలిపారు. గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో చర్చించి వారి పార్టీ నుంచి బూత్ స్థాయి ఏజెంట్లను నియమించేలా అవగాహన కల్పించాలని సూచించారు. బూత్ స్థాయి అధికారులు క్షేత్రస్థాయిలో తిరుగుతూ మ్యాపింగ్ చేపట్టాలని, పర్యవేక్షకులు మరియు ఏఈఆర్‌ఓలు వారికి అవసరమైన మార్గదర్శకాలు అందించి ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా ప్రక్రియ నిర్వహించాలని అన్నారు. బూత్ స్థాయి అధికారుల వివరాలు ప్రజలకు తెలిసేలా విస్తృత ప్రచారం చేయాలని, పెండింగ్‌లో ఉన్న ఫారం 6, 7, 8 దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్, ఎలక్షన్ సూపరింటెండెంట్ సంతోష్ తదితరులు పాల్గొన్నారు.



# రాయికోడ్ మండలంలో నాణ్యతలేని కల్వర్ట్ పనులపై రైతుల ఆగ్రహం

సందేశం టైమ్స్, సంగారెడ్డి జిల్లా రాయికోడ్, 14 మార్చి: సంగారెడ్డి జిల్లా రాయికోడ్ మండలంలో జరుగుతున్న రోడ్లు, కల్వర్ట్ నిర్మాణ పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించడం లేదని స్థానిక రైతులు, ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. రాయికోడ్ మండల కేంద్రం నుంచి యూసుఫ్‌పూర్, పిప్పడుపల్లి, జంగి గ్రామాల వరకు ప్రభుత్వం నిధులతో మొరం రోడ్లు వేసి మధ్య మధ్యలో కల్వర్టులు నిర్మిస్తున్నప్పటికీ పనులు నాసిరకంగా జరుగుతున్నాయని ఆరోపిస్తున్నారు. దశాబ్దాల పాటు మన్నికగా ఉండాల్సిన కాంక్రీట్ స్లాబ్ పనులు పంచాయతీరాజ్ శాఖ అధికారుల పర్యవేక్షణలో జరగాల్సి ఉన్నప్పటికీ అక్కడ కూలీలతోనే పనులు జరుపుతున్నారని, సంబంధిత అధికారులు సరైన పర్యవేక్షణ చేయడం లేదని గ్రామస్తులు విమర్శిస్తున్నారు. కల్వర్ట్ నిర్మాణాల్లో ఇసుక సరైన మోతాదులో ఉపయోగించడం లేదని, నాసిరకం సిమెంట్‌తో పనులు చేస్తున్నారని రైతులు ఆరోపించారు. రాయికోడ్ నుంచి పిప్పడుపల్లి వరకు సుమారు నాలుగు కిలోమీటర్ల రహదారి, రాయికోడ్ నుంచి జంగి వరకు రెండు కిలోమీటర్ల మేర నిర్మించిన రోడ్లు నాణ్యత లేకుండా ఉండటంతో చిన్న వర్షం పడినా దెబ్బతినే ప్రమాదం ఉందని వారు తెలిపారు. పనులు జరుగుతున్న ప్రదేశాల్లో అసిస్టెంట్ ఇంజనీర్ దేవయ్య తరచుగా పర్యవేక్షణ చేయడం లేదని, కాంట్రాక్టర్ మరియు అధికార పార్టీ నాయకులతో కలిసి పనులు నాసిరకంగా చేస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి పనులను పరిశీలించి నాణ్యత ప్రమాణాలు పాటించేలా చర్యలు తీసుకోవాలని, అవసరమైతే కాంట్రాక్టర్‌ను తొలగించి కొత్త కాంట్రాక్టర్ ద్వారా పనులు పూర్తి చేయించాలని మండల ప్రజలు, రైతులు డిమాండ్ చేస్తున్నారు.

# కోదాడలో వంట నూనెపై ఫుడ్ సేఫ్టీ అధికారుల తనిఖీలు







సందేశం టైమ్స్, సూర్యాపేట, 14 మార్చి: వంట నూనెల కల్తీకి సంబంధించిన ఫిర్యాదుల నేపథ్యంలో సూర్యాపేట జిల్లా ఫుడ్ సేఫ్టీ విభాగం అధికారులు కోదాడలో తనిఖీలు నిర్వహించారు. జోనల్ ఫుడ్ కంట్రోలర్ వి. జ్యోతిర్మయి ఆదేశాల మేరకు జిల్లా ఫుడ్ సేఫ్టీ అధికారి బి. ప్రభాకర్ కోదాడ టౌన్ పోలీస్ స్టేషన్‌కు వెళ్లి పోలీసులు స్వాధీనం చేసుకున్న వంట నూనెలను పరిశీలించారు. స్థానిక ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులపై స్పందించిన అధికారులు పోలీసులతో కలిసి వంట నూనెను రవాణా చేస్తున్న ఒక ఆటో మరియు ట్యాంకర్ వాహనాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ట్యాంకర్‌లో స్వీట్ ఆయిల్ కాకుండా రైస్ బ్రాన్ రిఫైన్డ్ ఆయిల్ ఉన్నట్లు గుర్తించారు. ట్యాంకర్ డ్రైవర్ ఆ నూనెను టిన్ డబ్బాలలో నింపి ఆటో వాహనంలో నిల్వ చేసినట్లు పోలీసులు తెలిపారు. ఈ టిన్ డబ్బాలను కోదాడ పట్టణంలో ఎవరికి సరఫరా చేయాల్సి ఉందో ప్రస్తుతం విచారణలో భాగంగా నిర్ధారించాల్సి ఉందని అధికారులు వెల్లడించారు. ట్యాంకర్ వాహనానికి ఎఫ్‌ఎస్‌ఎస్‌ఏఐ లైసెన్స్ ఉన్నప్పటికీ ఆటో వాహనానికి సంబంధిత లైసెన్స్ లేకపోవడం గుర్తించారు. అలాగే ట్యాంకర్‌లో నూనె రవాణా సమయంలో దొంగతనం లేదా కల్తీని నివారించేందుకు తగిన సీలింగ్ లేదా లాకింగ్ విధానం లేకపోవడం గమనించబడింది. ఈ ఘటనలో ట్యాంకర్ మరియు ఆటో వాహనాల నుంచి వంట నూనె నమూనాలను సేకరించి పరీక్షల కోసం హైదరాబాద్‌లోని రాష్ట్ర ఆహార ప్రయోగశాలకు పంపించారు. పరీక్షల్లో నూనె కల్తీ అయిందని తేలితే సంబంధితులపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని అధికారులు తెలిపారు. ప్రజలు ఎక్కడైనా ఆహార పదార్థాలలో కల్తీ జరుగుతుందనే అనుమానం వచ్చినట్లయితే వెంటనే ఫుడ్ సేఫ్టీ అధికారులకు సమాచారం ఇవ్వాలని జోనల్ ఫుడ్ కంట్రోలర్ వి. జ్యోతిర్మయి కోరారు. సూర్యాపేట జిల్లాలో ఆహార కల్తీపై ఫిర్యాదుల కోసం జిల్లా ఫుడ్ సేఫ్టీ అధికారి బి. ప్రభాకర్‌ను సంప్రదించాలని సూచించారు.

# మన్నాపూర్ ప్రాథమిక పాఠశాలలో జిల్లా అధికారుల తనిఖీ - విద్యార్థుల ప్రతిభకు అభినందనలు



సందేశం టైమ్స్ మొగుడంపల్లి, మార్చి 14( టీ సంగమేశ్వర్) సంగారెడ్డి జిల్లా మొగుడంపల్లి మండలంలోని మన్నాపూర్ ప్రాథమిక పాఠశాలలో జిల్లా అధికారుల బృందం శుక్రవారం ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించింది. ఈ సందర్భంగా పాఠశాలలో నిర్వహణలో ఉన్న రికార్డులు, ఎఫ్ఎల్ఎస్, ఎఫ్ఎల్ఎన్ కార్యక్రమాలు, ఉపాధ్యాయుల తరగతి బోధన విధానం (క్లాస్ అబ్జర్వేషన్), టీఎల్ఎం సామగ్రి తదితర అంశాలను పరిశీలించారు.పాఠశాల నిర్వహణపై అధికారులు సంతృప్తి వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా పాఠశాలలో స్వయం పాలన దినోత్సవం మరియు వీడ్కోలు కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా విద్యార్థులు ప్రధానోపాధ్యాయులుగా 5వ తరగతి విద్యార్థిని నందిని, ఉపాధ్యాయులుగా అభిలాష్, అవిలాష్, చంద్రకళ, వివేక్ పాత్రలు ధరించి కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా నోడల్ అధికారి ప్రదీప్ కుమార్, జిల్లా బృందం అధికారులు వహబోద్దీన్, నిమ్మల కిష్టయ్య విద్యార్థుల ప్రతిభను అభినందించి మెడల్స్ బహుకరించారు.ఈకార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు పి. పద్మ, ఉపాధ్యాయుడు యేసయ్య, స్కావెంజర్ సంజు మరియు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలు వెంటనే ఏర్పాటు చేయాలి: లింగాల కమలరాజు

## కొనుగోలు కేంద్రాలు లేక దళారీల చేతిలో మొక్కజొన్న రైతులు






సందేశం టైమ్స్ – చింతకాని, మార్చి 14: తెలంగాణ రాష్ట్రంలో రైతులు పండించిన పంటకు మద్దతు ధర కల్పించడంలోనూ, కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయడంలోనూ ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని ఖమ్మం మాజీ జిల్లా పరిషత్ చైర్మన్ లింగాల కమలరాజు విమర్శించారు. శుక్రవారం చింతకాని మండలంలోని నాగులవంచ గ్రామంలో బీఆర్ఎస్ నాయకుడు వంకాయలపాటి సత్యనారాయణ నివాసంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ చింతకాని, బోనకల్లు మండలాలు రాష్ట్రంలో అత్యధికంగా మొక్కజొన్న పండించే ప్రాంతాలని పేర్కొన్నారు. అయితే ప్రభుత్వం మొక్కజొన్నకు రూ.2400 మద్దతు ధర ప్రకటించినప్పటికీ కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయకపోవడంతో దళారులు కేవలం రూ.1600కే రైతుల నుంచి కొనుగోలు చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రైతులను ఆదుకోవాలంటే వెంటనే కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. కరోనా వంటి క్లిష్ట పరిస్థితుల్లో కూడా మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ రైతులకు అండగా నిలిచి కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశారని గుర్తు చేశారు. ఇటీవల కురిసిన అకాల వర్షాలతో నష్టపోయిన రైతులను ఆదుకోవడంలో జిల్లా మంత్రులు, అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన రైతు భరోసా, పెన్షన్ల పెంపు వంటి హామీలు అమలు కావడం లేదని అన్నారు. రైతులు యూరియా కోసం లైన్లలో నిలబడి కష్టపడి పండించిన పంటను తక్కువ ధరకు అమ్ముకోవాల్సిన పరిస్థితి రావడం దురదృష్టకరమని పేర్కొన్నారు. ఈ సమావేశంలో మంకెన రమేష్, బొడ్డు వెంకట రామారావు, పొనుగోటి రత్నాకర్, గురిజాల హనుమంతరావు, గడ్డం శ్రీనివాస్, వేముల నర్సయ్య, అప్పారావు, బండి రామారావు, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

# బీసీ కమిషన్ కార్యాలయంలో దస్త్రాల పరిష్కారం, శుభ్రత కార్యక్రమం

## 99 రోజుల ప్రజాపాలన-ప్రగతి ప్రణాళికలో భాగంగా కార్యక్రమం





సందేశం టైమ్స్, హైదరాబాద్, 14 మార్చి: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన 99 రోజుల ప్రజాపాలన–ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా ఖైరతాబాద్‌లోని బీసీ కమిషన్ కార్యాలయంలో దస్త్రాల పరిష్కారం మరియు పరిసరాల శుభ్రత కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బీసీ కమిషన్ ఛైర్మన్ జి. నిరంజన్, సభ్యులు రాపోలు జయప్రకాష్, తిరుమలగిరి సురేందర్, శ్రీమతి బాలలక్ష్మి, సభ్య కార్యదర్శి శ్రీమతి బి. బాల మాయాదేవి, ఐఏఎస్ పాల్గొన్నారు. సమావేశంలో డిప్యూటీ డైరెక్టర్ యు. శ్రీనివాసరావు, సహాయ కార్యదర్శి కె. మనోహర్ రావు, ప్రత్యేక అధికారి కుమారి ఎన్. సునీత, సెక్షన్ ఆఫీసర్లు జి. సతీష్ కుమార్, ఇర్ఫాన్ ఖాన్, రీసెర్చ్ ఆఫీసర్ జి. లక్ష్మీనారాయణ తదితర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఛైర్మన్, సభ్యులు, అధికారులు కార్యాలయ ఆవరణాన్ని పరిశీలించి పరిసరాల శుభ్రత కోసం తీసుకోవాల్సిన చర్యలను గుర్తించారు. ఈ పనులను వచ్చే వారం రోజుల్లో పూర్తి చేయాలని నిర్ణయించారు. కార్యాలయాన్ని పరిశుభ్రంగా, ఆహ్లాదకరమైన వాతావరణంలో ఉంచుకోవాలని సిబ్బందిని కోరిన ఛైర్మన్ జి. నిరంజన్, 99 రోజుల కార్యక్రమంలో భాగంగా పెండింగ్‌లో ఉన్న దస్త్రాలను త్వరగా పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు.




# జిల్లాలో ఎల్‌పీజీ గ్యాస్ కొరత లేదు: జిల్లా కలెక్టర్ పి. ప్రావీణ్య

సందేశం టైమ్స్, సంగారెడ్డి, 14 మార్చి (ఈ సంగమేశ్వర్): సంగారెడ్డి జిల్లాలో గృహ అవసరాలకు వినియోగించే ఎల్‌పీజీ గ్యాస్ సిలిండర్ల కొరత ఎక్కడా లేదని జిల్లా కలెక్టర్ పి. ప్రావీణ్య తెలిపారు. వినియోగదారులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అధికారులు నిరంతరం పర్యవేక్షిస్తూ అవసరమైన చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. హైదరాబాద్ సచివాలయం నుంచి రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు తదితర ఉన్నతాధికారులతో కలిసి జిల్లాల కలెక్టర్లు, ఎస్పీలు, పోలీస్ కమిషనర్లతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఎల్‌పీజీ గ్యాస్ సరఫరా పరిస్థితిపై సమీక్షించారు. ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో ఎల్‌పీజీ గ్యాస్ కొరత ఉందన్న ప్రచారంలో ఎలాంటి వాస్తవం లేదని స్పష్టం చేశారు. రాష్ట్రంలోని బాట్లింగ్ ప్లాంట్లలో ఎక్కడా గ్యాస్ కొరత నమోదు కాలేదని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా 810 ఎల్‌పీజీ డిస్ట్రిబ్యూటర్ల ద్వారా గ్యాస్ సరఫరా జరుగుతుండగా మొత్తం కోటి 29 లక్షల ఎల్‌పీజీ కనెక్షన్లు ఉన్నాయని, రోజుకు సగటున 2.5 లక్షల సిలిండర్లు సరఫరా చేస్తున్నట్లు వివరించారు. అపోహల కారణంగా ప్రస్తుతం బుకింగ్స్ 72 శాతం వరకు పెరిగినట్లు తెలిపారు. గృహ వినియోగదారులతో పాటు ఆసుపత్రులు, విద్యాసంస్థలు, వృద్ధాశ్రమాలు, ప్రభుత్వ సంస్థలకు ప్రాధాన్యత క్రమంలో గ్యాస్ సరఫరా కొనసాగుతుందని పేర్కొన్నారు. అపోహలను ఆసరాగా చేసుకుని గ్యాస్ నిల్వ చేయడం, మళ్లించడం, బ్లాక్ మార్కెటింగ్ చేయడం వంటి చర్యలకు ప్రభుత్వం కఠినంగా స్పందిస్తుందని హెచ్చరించారు. ఇప్పటివరకు రాష్ట్రవ్యాప్తంగా 288 కేసులు నమోదు చేసినట్లు వెల్లడించారు. పరిస్థితులను పర్యవేక్షించేందుకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఆధ్వర్యంలో హై లెవల్ కమిటీ ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా కమాండ్ కంట్రోల్ సెంటర్ ఏర్పాటు చేయాలని నిర్ణయించినట్లు వెల్లడించారు. జిల్లాల వారీగా కలెక్టర్ అధ్యక్షతన ప్రత్యేక కమిటీలను ఏర్పాటు చేసి రోజువారీ నిల్వలు, సరఫరా పరిస్థితిని సమీక్షించాలని ఆదేశించారు. పట్టణ ప్రాంతాల్లో 25 రోజులకు ఒకసారి, గ్రామీణ ప్రాంతాల్లో 45 రోజులకు ఒకసారి మాత్రమే ఎల్‌పీజీ బుకింగ్ చేయాలని వినియోగదారులకు సూచించారు. అవసరానికి మించి సిలిండర్లు బుక్ చేయకుండా అపోహలను నమ్మవద్దని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ ఆయిల్ ఫామ్ సాగుపై దృష్టి సారించి నిర్దేశిత లక్ష్యాలను సాధించాలని కలెక్టర్లకు సూచించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో సంగారెడ్డి జిల్లా కలెక్టర్ క్యాంప్ కార్యాలయం నుంచి జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్ మరియు సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు



# వార్డు సభ్యుడు దేవులపల్లి నాగరాజుకు ఉత్తమ ప్రశంసా పత్రం

సందేశం టైమ్స్, అనంతగిరి, 14 మార్చి: అనంతగిరి మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన రెండో బ్యాచ్ వార్డు సభ్యుల శిక్షణ కార్యక్రమంలో వాయిలసింగారం గ్రామానికి చెందిన 6వ వార్డు సభ్యుడు దేవులపల్లి నాగరాజు ఉత్తమ ప్రశంసా పత్రాన్ని అందుకున్నారు. తెలంగాణ గ్రామపంచాయతీ శాఖ ఆధ్వర్యంలో ఈ నెల 9 నుండి 13 వరకు నిర్వహించిన వార్డు సభ్యుల శిక్షణ కార్యక్రమంలో పాల్గొని ప్రతిభ కనబరిచినందుకు ఆయనకు ఈ ప్రశంసా పత్రాన్ని ప్రదానం చేశారు. కార్యక్రమంలో మండల అభివృద్ధి అధికారి (ఎంపీడీఓ) మరియు మండల పంచాయతీ అధికారి (ఎంపీఓ)ల చేతుల మీదుగా దేవులపల్లి నాగరాజుకు ఉత్తమ ప్రశంసా పత్రం అందజేశారు. ఈ సందర్భంగా గ్రామాభివృద్ధి కార్యక్రమాలలో చురుకుగా పాల్గొంటూ ప్రజలకు సేవలందించాలని అధికారులు సూచించారు. నాగరాజుకు ఈ ప్రశంసా పత్రం రావడంతో గ్రామ ప్రజలు, సహచర వార్డు సభ్యులు అభినందనలు తెలిపారు.

# మాజీ డీజీపీ హెచ్.జె. దొర మృతికి సీఎం రేవంత్ రెడ్డి సంతాపం

సందేశం టైమ్స్, హైదరాబాద్, 14 మార్చి: ఉమ్మడి రాష్ట్ర మాజీ డీజీపీ హెచ్.జె. దొర మృతికి ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. దొర కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేసిన సీఎం, పోలీసు శాఖలో ఆయన చేసిన సేవలను గుర్తు చేసుకున్నారు. ఉమ్మడి రాష్ట్రంలో ఇంటెలిజెన్స్ చీఫ్‌గా, అనంతరం డీజీపీగా పని చేసిన హెచ్.జె. దొర పోలీసు శాఖలో పలు సంస్కరణలు తీసుకువచ్చారని పేర్కొన్నారు. పోలీసు శాఖను ప్రజలకు మరింత చేరువ చేయడంలో ఆయన ఎంతో కృషి చేశారని సీఎం రేవంత్ రెడ్డి కొనియాడారు.

# రోడ్డు ప్రమాదంలో బాలుడి మృతి – గాయపడిన మరో బాలుడిని రక్షించిన ఆటో డ్రైవర్లు




సందేశం టైమ్స్, కోదాడ, 14 మార్చి: కోదాడ పట్టణంలోని సూర్యాపేట రోడ్‌లో లారీ ఆఫీస్ సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒక మైనర్ బాలుడు అక్కడికక్కడే మృతి చెందగా, మరొక బాలుడు తీవ్రంగా గాయపడిన ఘటన శుక్రవారం చోటుచేసుకుంది. సమాచారం ప్రకారం అటువైపు వెళ్తున్న లారీని ఇద్దరు మైనర్ బాలురు ఢీకొనడంతో ఈ ప్రమాదం జరిగింది. ప్రమాదంలో కోదాడకు చెందిన సన్నీ లోకేష్ అక్కడికక్కడే మృతి చెందగా, గాయపడిన మరో బాలుడు రాకేష్‌ను వెంటనే సూర్యాపేట ఏరియా ఆసుపత్రికి తరలించారు. ఘటన స్థలానికి చేరుకున్న కోదాడకు చెందిన ఆటో డ్రైవర్లు గౌరవరపు కోటేష్ మరియు వసంత్ తమ ఆటోలో స్వయంగా గాయపడిన బాలురిని ఆసుపత్రికి తరలించి మానవత్వాన్ని చాటుకున్నారు. మృతి చెందిన బాలుడిని కోదాడ ఆసుపత్రికి తరలించగా, గాయపడిన బాలుడికి సూర్యాపేటలో చికిత్స అందిస్తున్నారు. ఈ సందర్భంగా ఎస్సై సుధీర్ ఆటో డ్రైవర్లైన కోటేష్, వసంత్‌లను ప్రశంసిస్తూ రోడ్డు ప్రమాదాలకు గురైన వారికి ప్రతి ఒక్కరూ ఇలాంటి సహాయ సహకారాలు అందించాలని ప్రజలకు సూచించారు.



# మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలు వెంటనే ఏర్పాటు చేయాలి: లింగాల కమలరాజు

సందేశం టైమ్స్, చింతకాని, 14 మార్చి: రాష్ట్రంలో రైతులు పండించిన పంటకు మద్దతు ధర కల్పించడం, కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని ఖమ్మం మాజీ జిల్లా పరిషత్ చైర్మన్ లింగాల కమలరాజు విమర్శించారు. శుక్రవారం చింతకాని మండలంలోని నాగులవంచ గ్రామంలో బీఆర్ఎస్ నాయకుడు వంకాయలపాటి సత్యనారాయణ నివాసంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. చింతకాని, బోనకల్లు మండలాలు రాష్ట్రంలోనే అధికంగా మొక్కజొన్న పండించే ప్రాంతాలుగా ఉన్నప్పటికీ కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయకపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ప్రభుత్వం మొక్కజొన్నకు రూ.2,400 మద్దతు ధర ప్రకటించినప్పటికీ క్షేత్రస్థాయిలో కొనుగోలు కేంద్రాలు లేకపోవడంతో దళారులు రైతుల వద్ద రూ.1,600కే కొనుగోలు చేస్తున్నారని ఆరోపించారు. వెంటనే మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి రైతులను ఆదుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. కరోనా సమయంలో కూడా మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ రైతులకు అండగా నిలిచి కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశారని గుర్తు చేశారు. ఇటీవల కురిసిన అకాల వర్షాలతో పంట నష్టపోయిన రైతులను ఆదుకోవడంలో జిల్లా మంత్రులు, అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన రైతు భరోసా రూ.15 వేల సహాయం, వృద్ధులకు రూ.4 వేల పెన్షన్, వికలాంగులకు రూ.6 వేల పెన్షన్ వంటి హామీలు అమలు కావడం లేదని అన్నారు. రైతు బీమా అందక రైతు కుటుంబాలు ఇబ్బందులు పడుతున్నాయని పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలను అమలు చేయాలని మాత్రమే తాము కోరుతున్నామని తెలిపారు. ఈ సమావేశంలో మంకెన రమేష్, బొడ్డు వెంకట రామారావు, మాజీ ఎంపీపీ పొనుగోటి రత్నాకర్, మాజీ వైస్ ఎంపీపీ గురిజాల హనుమంతరావు, గడ్డం శ్రీనివాస్, వేముల నర్సయ్య, అప్పారావు, బండి రామారావు, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

**సంగారెడ్డి జిల్లాలో షెడ్యూల్డ్ కులాల అభివృద్ధికి 409 స్వయం ఉపాధి యూనిట్లు మంజూరు – 257 ఈవీ ద్విచక్ర వాహనాలు, 125 మూడు చక్రాల వాహనాలు, 27 సోలార్ పరికరాలు; రూ.821 లక్షల ఆర్థిక సహాయం అందిస్తూ మార్చి 17–24 మధ్య ఆన్‌లైన్ దరఖాస్తులు స్వీకరణ**



సందేశం టైమ్స్, సంగారెడ్డి, మార్చి 14 (టీ సంగమేశ్వర్): తెలంగాణ ప్రభుత్వం అమలు చేస్తున్న షెడ్యూల్డ్ కులాల కార్యాచరణ ప్రణాళిక 2025–26లో భాగంగా సంగారెడ్డి జిల్లాకు బ్యాంకు సంబంధిత స్వయం ఉపాధి పథకాల కింద 409 యూనిట్లు మంజూరు చేయనున్నట్లు జిల్లా కలెక్టర్ పి. ప్రావీణ్య తెలిపారు. ఇందులో 257 ఈవీ ద్విచక్ర వాహనాలు, 125 మూడు చక్రాల వాహనాలు, 27 సోలార్ యూనిట్ పరికరాలు ఉన్నాయి. ఈ పథకాల కోసం రూ.821 లక్షల ఆర్థిక సహాయం కేటాయించబడింది. అర్హులైన అభ్యర్థులు మార్చి 17 నుంచి 24 వరకు https://tgobmms.cgg.gov.in ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకుని, గ్రామీణ ప్రాంతాల అభ్యర్థులు ఎంపీడీవో కార్యాలయం, పట్టణ ప్రాంతాల అభ్యర్థులు మున్సిపల్ కమిషనర్ కార్యాలయంలో సమర్పించాలి. ఒక్క కుటుంబంలో ఐదేళ్లలో ఒకరికి మాత్రమే పథకం మంజూరు అవుతుంది; దివ్యాంగులకు 5% మరియు మహిళలకు 33⅓% రిజర్వేషన్ ఉంటుందని కలెక్టర్ తెలిపారు.



## వట్‌పల్లి పాఠశాలలో 10వ తరగతి విద్యార్థులకు పరీక్షల కోసం ఎగ్జామ్ ప్యాడ్లు, కిట్లు పంపిణీ

సందేశం టైమ్స్, వట్పల్లి, మార్చి 14 (అందోల్ టౌన్ రిపోర్టర్ బి రమేష్ బాబు): అందోల్ నియోజకవర్గంలోని వట్‌పల్లి మండలం దేవునూర్ గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 10వ తరగతి విద్యార్థులకు పరీక్షల కోసం అవసరమైన ఎగ్జామ్ ప్యాడ్లు, ఎగ్జామ్ కిట్లు పంపిణీ చేశారు. కార్యక్రమాన్ని వట్‌పల్లి మండల కాంగ్రెస్ పార్టీ నాయకుడు పెద్దపట్ల వినయ్ గౌడ్ మరియు ఎన్ఎస్‌యూఐ యువ నేతలు సంయుక్తంగా నిర్వహించి విద్యార్థులకు పరీక్షల్లో మంచి ఫలితాలు సాధించాలని ప్రోత్సాహం అందించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు నర్సింలు, అలీం, కె. బస్వరాజ్, సంగన్నపటేల్, శంకర్, లోకేష్, కమర్, శ్రీశైలం, నరేష్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.




## రాయికోడ్‌లో చలివేంద్రం ఏర్పాటు - ప్రజల దాహార్తి తీర్చడమే లక్ష్యం

సందేశం టైమ్స్ రాయికోడ్, మార్చి 14 ( సంగారెడ్డి టౌన్ ప్రతినిధి బి సంగమేశ్వర్) వేసవికాలంలో ప్రయాణికుల దాహార్తి తీర్చేందుకు చలివేంద్రాలను ఏర్పాటు చేయడం ప్రజా సేవ అని స్థానిక ఎస్ఐ చైతన్య కిరణ్ తెలిపారు. సంగారెడ్డి జిల్లా రాయికోడ్ మండల కేంద్రంలో శుక్రవారం మొట్లకుంట సంగమేశ్వర్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు విట్టల్, ఎస్ఐ చైతన్య కిరణ్, మాజీ వైస్ చైర్మన్ తుకారం కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వేసవిలో తీవ్ర ఎండల కారణంగా ప్రయాణికులు ఇబ్బందులు పడకుండా ఉండేందుకు ఇలాంటి సేవా కార్యక్రమాలు నిర్వహించడం అవసరమని పేర్కొన్నారు. సమాజంలో మానవసేవే మాధవ సేవ అని తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ రాజు, గ్రామ పార్టీ అధ్యక్షుడు మల్లేశం, గ్రామ పెద్దలు విట్టల్ రావు కులకర్ణి, సంసాన్ తదితరులు పాల్గొన్నారు.



## చిట్కుల్‌లో శ్రీ వేణుగోపాల స్వామి ఆలయ వార్షికోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి

సందేశం టైమ్స్, సంగారెడ్డి/పటాన్చెరు, మార్చి 14 (సంగారెడ్డి టౌన్ ప్రతినిధి బి సంగమేశ్వర్): సంగారెడ్డి జిల్లా పటాన్చెరు నియోజకవర్గంలోని ఇస్నాపూర్ మున్సిపల్ పరిధి చిట్కుల్ గ్రామంలో గల శ్రీ వేణుగోపాల స్వామి దేవాలయం వార్షికోత్సవంలో ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులతో కలిసి ప్రార్థనలు చేసిన ఆయన, దేవాలయాల అభివృద్ధి, నూతన దేవాలయాల నిర్మాణాలకు తమ వంతు సహకారం అందిస్తామని తెలిపారు. ప్రతి ఒక్కరూ దైవభక్తిని పెంపొందించి సమాజంలో సౌహార్ద వాతావరణాన్ని కాపాడాలని సూచించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ శ్రీశైలం యాదవ్, సీనియర్ నాయకులు నరేందర్ రెడ్డి, విష్ణువర్ధన్ రెడ్డి, చిన్న రాములు, కౌన్సిలర్లు వెంకటేష్, ఆంజనేయులు, నాగభూషణం, గ్రామ ప్రముఖులు, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## పోసానిపేటలో ఇందిరమ్మ ఇళ్లు ప్రారంభం



అందోల్, మార్చి 14 (అందోల్ టౌన్ ప్రతినిధి బి రమేష్ బాబు): అందోల్ నియోజకవర్గంలోని పోసానిపేట గ్రామంలో నిర్మాణం పూర్తయిన ఇందిరమ్మ ఇల్లు శుక్రవారం గ్రామ ప్రజల సమక్షంలో ప్రారంభించబడింది. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ జి. గోపాల్, ఉప సర్పంచ్ జి. రాములు, విలేజ్ సెక్రటరీ, వార్డు సభ్యులు, గ్రామ పెద్దలు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. ఈ సందర్భంలో ప్రభుత్వం చేపడుతున్న పథకాలను సమర్థవంతంగా అమలు చేస్తూ అర్హులైన లబ్ధిదారులకు ఇళ్లు అందించడం ఆనందంగా ఉందని వారికి పేర్కొన్నారు.



## తడ్కాల్‌లో ఇఫ్తార్ విందులో పాల్గొన్న కాంగ్రెస్ నాయకుడు పట్లోళ చంద్రశేఖర్ రెడ్డి

సందేశం టైమ్స్ నారాయణఖేడ్, మార్చి 14 ( సంగారెడ్డి టౌన్ ప్రతినిధి బి సంగమేశ్వర్)సంగారెడ్డి జిల్లా నారాయణఖేడ్ నియోజకవర్గంలోని కంగ్టి మండలం తడ్కాల్ గ్రామంలో సర్పంచ్ సుగుణ మల్లారెడ్డి ఆహ్వానం మేరకు నిర్వహించిన మైనార్టీ నాయకుల ఇఫ్తార్ విందు కార్యక్రమంలో రాష్ట్ర కాంగ్రెస్ నాయకుడు పట్లోళ చంద్రశేఖర్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మైనార్టీ సోదరులకు పండ్లు అందజేసి రోజా విడిపించి రంజాన్ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. మతసామరస్యానికి రంజాన్ పండుగ ప్రతీకగా నిలుస్తుందని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లారెడ్డి, సర్పంచ్ ఎలిచాల సుగుణ మల్లారెడ్డి, శ్రీకాంత్, శివాజీ పాటిల్, రామగౌడ్, అమిన్, హన్మంత్, ధాత్తా రెడ్డి, వైద్యనాథ్ పటేల్, బాబుసాబ్, డా. హమీద్, మనోహర్ పాటిల్ (మాజీ సర్పంచ్), బి. రాజు ముదిరాజ్, మహేష్ కౌన్సిలర్లు, ఎన్ఎస్‌యూఐ జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీనివాస్ రెడ్డి, కృష్ణరెడ్డి, ఇదయాత్, కాజా సాబ్, ఆకుల రాములు, మారుతీరావు తదితరులు పాల్గొన్నారు.



## ఔట్‌సోర్సింగ్ మెడికల్ ఉద్యోగులకు బేసిక్ వేతనం చెల్లించాలి: యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం. నరసింహ

సందేశం టైమ్స్ సంగారెడ్డి, మార్చి 14 ( టీ సంగమేశ్వర్) ప్రభుత్వ ఆసుపత్రుల్లో పనిచేస్తున్న ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు ఔట్‌సోర్సింగ్ నిబంధనల ప్రకారం రెగ్యులర్ ఉద్యోగుల బేసిక్ వేతనం చెల్లించాలని తెలంగాణ మెడికల్ కాంట్రాక్ట్ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం. నరసింహ డిమాండ్ చేశారు. శుక్రవారం సంగారెడ్డి జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో జరిగిన మెడికల్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ జనరల్ బాడీ సమావేశం ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు ఎం.ఏ. రహమాన్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా నరసింహ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల మేనిఫెస్టోలో ప్రకటించినట్లుగా ఔట్‌సోర్సింగ్ కార్పొరేషన్ ఏర్పాటు చేసి ఉద్యోగులకు జీతాలు చెల్లించాలని కోరారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు సమాన పనికి సమాన వేతనం అమలులో ఉండేదని, తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత మూడు కేటగిరీలుగా విభజించడం వల్ల బేసిక్ వేతనం కోల్పోయారని విమర్శించారు. సుప్రీంకోర్టు సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని పలుమార్లు తీర్పులు ఇచ్చినా రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేయడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఆసుపత్రుల్లో పనిచేస్తున్న ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు కాంట్రాక్టర్లు నెలల తరబడి జీతాలు చెల్లించకుండా నిర్లక్ష్యం చేస్తున్నారని ఆరోపించారు. ఏజెన్సీ వ్యవస్థను రద్దు చేసి ఔట్‌సోర్సింగ్ కార్పొరేషన్ ద్వారా నేరుగా జీతాలు చెల్లించే విధానం అమలు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. సమావేశంలో ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి పి. వెంకటరాజ్యం, డిపిఓల యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు సిద్ధార్థ తదితరులు పాల్గొన్నారు. అనంతరం యూనియన్ నూతన కమిటీని ఎన్నుకోగా గౌరవ అధ్యక్షుడిగా ఎం.ఏ. రహమాన్, అధ్యక్షుడిగా సయ్యద్ ఖాసిం ఇర్ఫాన్, కార్యనిర్వాహక అధ్యక్షుడిగా పూజారి ప్రవీణ్ కుమార్, ఉపాధ్యక్షులుగా భానుచందర్, పద్మ, శివ, ప్రధాన కార్యదర్శిగా చల్లా వాసు, సహాయ కార్యదర్శులుగా కొత్తపల్లి చంద్రశేఖర్, అబ్దుల్ ఫహీం, అంజిబాబు, సుధాకర్ ముదిరాజ్, జాన్, లింగం, అభిమన్యు, సయ్యద్ పాషా, సరస్వతి, మమతలను ఎన్నుకున్నారు.



## పటాన్‌చేరు మార్కెట్ కమిటీ నూతన చైర్మన్, వైస్ చైర్మన్‌కు ఘన సన్మానం

సందేశం టైమ్స్, సంగారెడ్డి, మార్చి 14 (సంగారెడ్డి టౌన్ ప్రతినిధి బి సంగమేశ్వర్): పటాన్‌చేరు మార్కెట్ కమిటీ నూతన చైర్మన్‌గా శివానందం, వైస్ చైర్మన్‌గా పట్లోళ్ల రాజశేఖర్ ప్రమాణ స్వీకారం చేసిన సందర్భంగా వారికి ఘన సన్మానం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన బ్లాక్ కాంగ్రెస్ నాయకుడు గడ్డం శ్రీశైలం, 18వ వార్డు కౌన్సిలర్ మన్నే రాఘవేంద్ర నూతన పదవీదారులకు శుభాకాంక్షలు తెలిపారు. బాధ్యతలు స్వీకరించిన చైర్మన్, వైస్ చైర్మన్ రైతుల సంక్షేమం, మార్కెట్ అభివృద్ధి కోసం కృషి చేస్తారని ప్రకటించారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పాల్గొని నూతన పదవీదారులను అభినందించారు.

## జోగిపేటలో సీసీ రోడ్డు నిర్మాణ పనులకు శ్రీకారం



సందేశం టైమ్స్అందోల్, మార్చి 14 ( అందోల్ నియోజకవర్గ ఇన్చార్జి కే మల్లేశం గౌడ్)అందోల్ నియోజకవర్గంలోని జోగిపేట మున్సిపాలిటీ 15, 17వ వార్డుల్లో శుక్రవారం సీసీ రోడ్డు నిర్మాణ పనులకు మున్సిపల్ చైర్మన్ ఎస్. కృష్ణారెడ్డి శ్రీకారం చుట్టారు. 17వ వార్డులో పోచమ్మ ఆలయం నుంచి మాల పోచమ్మ గుడి రోడ్ వరకు, అలాగే మసీదు నుంచి పాల శివన్న ఇంటివరకు సీసీ రోడ్డు పనులను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ ఆకుల సత్యనారాయణ (చిట్టిబాబు), 17వ వార్డు కౌన్సిలర్ నేనావత్ మేఘరాణి సైలన్, 18వ వార్డు కౌన్సిలర్ బేగరి శశిరేఖ అనిల్, మాజీ చైర్మన్ గూడెం మల్లయ్య, ఏఈ శ్రీకాంత్, మార్కెట్ డైరెక్టర్ ఫారూక్ హుస్సేన్, కాంట్రాక్టర్ డాకూరి శ్రీనివాస్, నాయకులు తిమ్మిగారి పాండు, కట్ట రాజు, కటికే మాయ తదితరులు పాల్గొన్నారు.




## సంగారెడ్డి నియోజకవర్గ గ్రామాలకు సీసీ రోడ్ల నిర్మాణానికి రూ.2 కోట్ల ఎన్‌ఆర్‌ఈజీఎస్ నిధులు మంజూరు

సందేశం టైమ్స్, సంగారెడ్డి, మార్చి 14 (సంగారెడ్డి టౌన్ ప్రతినిధి బి సంగమేశ్వర్): సంగారెడ్డి నియోజకవర్గంలోని పలు గ్రామాల్లో సీసీ రోడ్ల నిర్మాణానికి ఎన్‌ఆర్‌ఈజీఎస్ నిధుల ద్వారా రూ.2 కోట్లు మంజూరైనట్లు ఎమ్మెల్యే చింత ప్రభాకర్ తెలిపారు. ఈ నిధులతో రోడ్ల నిర్మాణ పనులు రేపటి నుంచి ప్రారంభం కానున్నాయని ఆయన పేర్కొన్నారు. రోడ్ల నిర్మాణం పూర్తయిన తర్వాత గ్రామ ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యం లభించబోతుంది, ముఖ్యంగా వర్షాకాలంలో మట్టి రోడ్ల వల్ల ఎదురయ్యే ఇబ్బందులు గణనీయంగా తగ్గుతాయని ఎమ్మెల్యే తెలిపారు. స్థానిక ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు ఎమ్మెల్యే చింత ప్రభాకర్ కృషికి కృతజ్ఞతలు తెలిపారు.



## జోగులాంబ పంచాయతీ కార్యదర్శి లంచం తీసుకుంటూ ఏసీబీకి చిక్కాడు

సంగారెడ్డి, మార్చి 14 (సంగారెడ్డి నియోజకవర్గ ఇన్చార్జి కె. సంగమేశ్వర్): గద్వాల జిల్లా అయిజా మండలం ఎక్లాస్‌పూర్ గ్రామానికి చెందిన పంచాయతీ కార్యదర్శి బోయ రాజన్న లంచం తీసుకుంటూ అవినీతి నిరోధక శాఖ అధికారుల చేతికి పడ్డాడు. ఇందిరమ్మ ఇంటి నిర్మాణానికి నాలుగు విడతలుగా మంజూరైన నిధుల కోసం ప్రతి బిల్లుకు రూ.5 వేలు డిమాండ్ చేసిన ఆయన, రూ.20 వేలకు గాను రూ.15 వేలు ఒప్పందం కుదుర్చుకుని శుక్రవారం ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో రూ.15 వేలు లంచం స్వీకరిస్తుండగా రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుబడ్డాడు. కార్యదర్శి రాజన్నను అరెస్ట్ చేసి హైదరాబాద్ ఏసీబీ కోర్టులో హాజరుపరిచినట్లు డీఎస్పీ తెలిపారు.



## రేపటి నుంచి తెలంగాణలో పదో తరగతి పరీక్షలు ప్రారంభం - 9.35 తర్వాత హాలులోకి అనుమతి లేదు

హైదరాబాద్, మార్చి 14 (టీ సంగమేశ్వర్): తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా శనివారం నుండి పదో తరగతి వార్షిక పరీక్షలు ప్రారంభమవుతాయి. మొత్తం 5,28,239 మంది విద్యార్థులు హాజరవనున్న ఈ పరీక్షల కోసం 2,676 కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు విద్యాశాఖ అధికారులు తెలిపారు. ఉదయం 9.30 గంటలకు పరీక్ష ప్రారంభమవుతుందని, కేవలం ఐదు నిమిషాల గ్రేస్ పీరియడ్‌తో 9.35 గంటల వరకు మాత్రమే విద్యార్థులను హాలులోకి అనుమతిస్తామని స్పష్టం చేశారు. చివరి నిమిషపు రద్దీ నివారించేందుకు విద్యార్థులు కనీసం అరగంట ముందే పరీక్షా కేంద్రానికి చేరుకోవాలని సూచించారు. సిట్టింగ్, ఫ్లయింగ్ స్క్వాడ్‌లు, పరీక్షా కేంద్రాల పరిసరాల్లో సెక్షన్ 144 అమలు, సమీప జిరాక్స్ కేంద్రాలను తాత్కాలికంగా మూసివేయడం వంటి ఏర్పాట్లు కొనసాగుతున్నాయి. విద్యార్థులు అధికారిక వెబ్‌సైట్ నుంచి హాల్ టికెట్లు డౌన్‌లోడ్ చేసుకోవచ్చని, ఫోటో స్పష్టంగా లేకపోతే ప్రధానోపాధ్యాయుడి ద్వారా అటెస్టేషన్ చేయించుకోవాలని సూచించారు. వేసవి ఉష్ణోగ్రతలకు కేంద్రాల్లో తాగునీరు, ప్రాథమిక వైద్య సదుపాయాలు ఏర్పాటు చేసినట్లు అధికారులు తెలిపారు.

పత్రిక పేరు : సందేశం టైమ్స్ (Sandesham Times) – రిజిస్ట్రేషన్ నం :TGTEL/25/A0348, టైటిల్ కోడ్: Sandhesham Times, ప్రచురణ స్థలం: 3-82, వాయిల సింగారం గ్రామం, అనంతగిరి మండలం, సూర్యాపేట జిల్లా, తెలంగాణ – 508206, ప్రచురణకర్త / యజమాని / సంపాదకురాలు: కాసే అమృత, మొబైల్: 9052045435, ఈ-మెయిల్: sandeshamtimes@gmail.com, వెబ్‌సైట్: www.sandeshamtimes.com, ముద్రణ స్థలం: సండే ప్రింటింగ్ ప్రెస్ (Sunday Printing Press), 3-4297, సరస్వతి కాంప్లెక్స్, SVN కాలనీ, గుంటూరు, ఆంధ్రప్రదేశ్ – 522006.